## 20498 పాయింట్ల వద్ద

# బలమైన నిరోధం




**సమీక్ష:** వరుసగా నాలుగో వారమూ మార్కెట్ ఆకర్షణీయమైన లాభాలను మూటకట్టుకుంది. విదేశీ సంస్థాగత మదుపర్లు(ఎఫ్ఐఐ) పెద్దఎత్తున్న కొనుగోళ్లు చేయడంతో పాటు షార్ట్ కవరింగ్ కారణంగా మార్కెట్ ర్యాలీ కొనసాగింది. సెన్సెక్స్ 20045 పాయింట్ల వద్ద శుక్రవారం ముగిసింది. ఎఫ్ఐఐ నిధుల ప్రవాహం గణనీయంగా పెరగడం, ముందస్తు పన్ను గణాంకాలు ఆకర్షణీయంగా నమోదవడంతో గత వారంలో మార్కెట్ గమనం ఆశాజనకంగా ప్రారంభమైంది. వారం మధ్యలో మదుపర్లు లాభాల స్వీకరణ చేసినప్పటికీ, డెరివేటివ్‌ల గడువు ముగియడానికి ముందు జరిగిన షార్ట్ కవరింగ్ కారణంగా మార్కెట్ లాభాల బాటలోనే నిలవగలిగింది.

**ఎఫ్ఐఐల తీరు:** గత వారంలో ఎఫ్ఐఐలు రూ.8,995 కోట్ల కొనుగోళ్లతో నికర కొనుగోలుదార్లుగా నిలవగా మ్యూచువల్ ఫండ్లు రూ.2,033 కోట్ల విలువైన నికర విక్రయాలు చేశారు.

**రంగాల వారీగా:** ఎఫ్ఎంసీజీ రంగం గత వారంలో అత్యుత్తమ లాభాలను ఆర్జించగా, మన్నికైన వినిమయ వస్తువులు, వాహన షేర్లు కళను సంతరించుకున్నాయి. ఇవన్నీ ప్రధానంగా దేశీయ వినియోగంపై ఆధారపడిన రంగాలు కావడం గమనార్హం. చమురు రంగం అత్యధికంగా నష్టపోయింది. ఆహార ద్రవ్యోల్బణ గణాంకాలు పెరిగిన నేపథ్యంలో స్థిరాస్తి రంగం డీలాపడింది. లాభ,నష్టాల నిష్పత్తి 4:3గా నమోదైంది. ఎంపిక చేసిన విభాగాల్లో కొనుగోళ్లు జరిగాయనేందుకు ఇదొక సంకేతం.

**భవిష్యత్ అంచనాలు:** స్వల్పకాలంలో 20,498 పాయింట్ల వద్ద బలమైన నిరోధం ఎదురవ్వొచ్చు. ఆ స్థాయిని దాటినట్లయితే స్వల్ప/మధ్య కాలంలో 21207 పాయింట్ల జీవిత కాల గరిష్ఠ స్థాయి వద్ద మార్కెట్ కీలక నిరోధాన్ని చవిచూడొచ్చు. ఒకవేళ 19445 పాయింట్ల దిగువన ముగిస్తే స్వల్ప కాలానికి అధోముఖంగా పయనించే అవకాశాలున్నాయి.

**ప్రభావితం చేసే అంశాలు:** అయోధ్య వివాదంపై మంగళవారం వెలువడనున్న హైకోర్టు తీర్పు; గురువారంతో ముగియనున్న డెరివేటివ్ కాంట్రాక్టుల గడువు; అదే రోజు విడుదలయ్యే ద్రవ్యోల్బణ గణాంకాలు;శుక్రవారం విడుదలవనున్న వాహన విక్రయ, సిమెంటు ఉత్పత్తి గణాంకాలు; అమెరికా జీడీపీ, నిరుద్యోగ గణాంకాలు; ఎఫ్ఐఐల పెట్టుబడులు వంటివి మార్కెట్‌ను ప్రభావితం చేయొచ్చు.

**తక్షణ మద్దతు స్థాయిలు:** 19772, 19445, 19218; **తక్షణ నిరోధ స్థాయిలు:** 20238, 20,498, 20,873

**స్వల్పకాలంలో 20,498 పాయింట్ల వద్ద మార్కెట్లకు నిరోధం ఎదురయ్యే అవకాశాలున్నాయి.**

- సతీశ్ కంతేటి, జెన్ సెక్యూరిటీస్